స్వచ్ఛతను హరిస్తున్నా..



- తగ్గని ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగం
- విచ్చలవిడిగా వాడకం
- ప్రచారాలకే పరిమితమవుతున్న నిబంధనలు
- పర్యావరణంపై తీవ్ర ప్రభావం

పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగం ఏ మాత్రం తగ్గలేదు. చిన్నచిన్న షాపులతో పాటు పెద్ద దుకాణాల్లో కూడా యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం కొనసాగుతోంది. వ్యాపారులు, వినియోగదారులు ప్రతి చిన్న అవసరానికి ప్లాస్టిక్‌ను వినియోగించటం వల్ల దీని నియంత్రణ వీలు కావటంలేదు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛతను అందించాలంటే పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌కు ప్రతి ఒక్కరు స్వస్తి పలకాలని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.



ఈ చెత్తలో సగభాగం ప్లాస్టిక్ కవర్లే.. (ప్లాస్టిక్ వినియోగం ఏ మేరకు జరుగుతుందో ఈ చెత్తే నిదర్శనం)

డాబాగార్డెన్స్ : పర్యావరణానికి హాని కలిగించే పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువుల నిషేధం అమలుకు నోచుకోవడం లేదు. కిరాణా దుకాణాల్లో వీటి వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. దీనిని నియంత్రించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు విచ్చలవిడిగా విక్రయాలు జరుపుతూ పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నారు. ఏ ప్రాంతంలో చూసినా ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వినియోగం కొనసాగుతూనే ఉంది. ప్రధానంగా హోటళ్లు, చికెన్ సెంటర్లు, చిన్న చిన్న దుకాణాలతో పాటు పలు మార్కెట్లలో నిత్యం వీటి వాడకం పరిపాటిగా మారింది. ఈ ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను వినియోగించిన అనంతరం ఎక్కడ పడితే అక్కడ పారేయడంతో గుట్టలుగా పేరుకుపోతున్నాయి.

అమలు కాని నిబంధనలు..

40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి. దీనికి విరుద్ధంగా ప్లాస్టిక్ వినియోగించే వారిపై కేసులు నమోదు చేయాలనే నిబంధన ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో వీటికి ప్రత్యామ్నాయంగా పేపర్ గ్లాసులు, కవర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇవి భూమిలో కలిసిపోయినా ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిసినప్పటికీ వాటిని ఎవరూ వినియోగించడం లేదు. వీటి ధర ఎక్కువగా ఉందని, తక్కువకు వచ్చే పాలిథిన్ వైపే వ్యాపారులు సైతం మొగ్గు చూపుతున్నారు. దీంతో వినియోగదారులు కూడా వీటితోనే సరకులు తీసుకెళ్తున్నారు.

ప్రకటనలకే పరిమితం..

ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. వాటిని విక్రయిస్తే జరిమానా విధిస్తామని అధికారులు చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. వీటిని విక్రయించే వారిపై అధికారులు తీసుకున్న చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. ఒక వేళ దాడులు చేస్తున్నా తూతూ మంత్రంగా సాగించడంతో పెద్దగా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో నిత్యం ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల విక్రయాలపై చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.



తక్కువ ధరకు వస్తున్నాయనే..



ప్లాస్టిక్ వినియోగంపై అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. వీటి వల్ల కలిగే అనర్థాలపై అతి తక్కువ మందికే తెలియడంతో ఈ వినియోగం తగ్గడం లేదు. తక్కువ ధరకు వస్తున్నాయని చూస్తున్నారే తప్పా.. వీటి వల్ల కలిగే నష్టాన్ని గుర్తించడం లేదు.

– దైవకుమార్, ఆశిపాపవీధి

కచ్చితంగా నిబంధనలు అమలు చేయాలి..



అధికారులు పాలిథిన్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. వీటిని విక్రయించే షాపులపై దాడులు చేసి జరిమానాలు విధించడంతో పాటు వారికి పూర్తిస్థాయిలో అవగాహన కలిగిస్తేనే అడ్డుకట్ట పడుతుంది. లేకుంటే పర్యావరణం మరింత కలుషితమై ప్రజలు అనారోగ్యం బారిన పడక తప్పదు.

– వర్రి నాగ అరుణ్‌కుమార్, దిబ్బలపాలెం, మహారాణిపేట

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 19.9 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సేవకులు

కంచరపాలెం : జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు గురువారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. 61 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాలకు సంబంధించి రూ.19,09,971 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. సహాయ కమిషనర్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి. వసంతకుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏపీబీవీ బ్యాంక్, కంచరపాలెం పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొండవాలులో పాక్షిక చర్యలు

గోపాలపట్నం : రామకృష్ణానగర్‌లో ఇటీవల కొండచరియలు విరిగిపడిన చోట జీవీఎంసీ అధికారులు పాక్షికంగా చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతంలో ఇసుక బస్తాలు వేయించి మట్టి కిందకు జారకుండా చేస్తున్నారు. ఈ పనులను జోనల్ కమిషనర్ హేమావతి పర్యవేక్షించారు. ఇప్పటి వరకు నాలుగు వరసలు వేశారు. ఇలా సగం ఎత్తు వరకు వేస్తామని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



రామాలయం వద్ద దీపారాధనలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు పరిధి కుమ్మరవీధి రామాలయం వద్ద వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా గురువారం సాయంత్రం గణేష్ మండపం వద్ద దీపారాధన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులు పాల్గొని దీపాలు వెలిగించి గణపతికి పూజలు చేశారు.

గణగళ్లకు అరుదైన గౌరవం



గణగళ్ల విజయకుమార్

డాబాగార్డెన్స్ : సామాజికవేత్త, అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గణగళ్ల విజయకుమార్‌కు అరుదైన గౌరవం దక్కింది. భారత ప్రభుత్వంచే గుర్తింపు పొందిన హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ మిషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ మేరకు మిషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నితల ప్రకాష్ నియామక పత్రం అందజేశారు. విజయ్‌కుమార్ గత 30 ఏళ్లుగా సామాజిక సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తున్నారు. పలు అవార్డులు అందుకున్నారు.

క్విజ్ పోటీల్లో ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ



కాంస్య పతకం సాధించిన క్యాడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల తదితరులు

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిభ చూపారు. కళాశాల ఎన్‌సీసీ యూనిట్ నుంచి జూనియర్ అండర్ ఆఫీసర్ సీహెచ్ లక్ష్మీ పల్లవి, ఎస్‌జీటీఎస్. కిరణ్మయి నేవల్ మెడికల్ యూనిట్ నిర్వహించిన ఫస్ట్ ఎయిడ్ క్విజ్ పోటీల్లో పాల్గొని తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల గురువారం వారిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ కె. గీతాంజలి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి. సంతోషి, అనూష తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



మహాధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

డాబాగార్డెన్స్ : మోదీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ విధ్వంసాన్ని ఆపి సెయిల్‌లో విలీనం చేయాలని, టీడీపీ, జనసేన కూటమి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ రక్షణకు పూనుకోవాలని, ప్లాంటుకు సొంత గనులు, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వాలని, ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడిపించాలని, ఖాళీలు భర్తీ చేయాలని, నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని, సకాలంలో జీతాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న పాత గాజువాకలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విజ్ఞప్తి చేశారు. మహాధర్నా పోస్టర్ గురువారం సీపీఎం జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాకు అధికారం ఇవ్వండి.. స్టీల్‌ప్లాంట్ అమ్మకం జరగదు.. ప్రభుత్వ రంగంలో మరింత బలోపేతం చేస్తాం అని పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నాయకులు ప్రజలకు వాగ్దానం చేశారన్నారు. ప్రజలు నమ్మి భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ఇప్పుడు ప్లాంట్‌ను అగాథంలోకి నెట్టే చర్యలను కేంద్రం చేపడుతుంటే కూటమి కేంద్రాన్ని నిలదీయకపోవడం ప్రజల ఆశలను వమ్ము చేయడమేనని ఆరోపించారు. రాజకీయంగా ఇంతటి అనుకూల పరిస్థితి గతంలో లేదు. అయినా మోదీ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటం కన్నా రాష్ట్ర ప్రయోజనం వీరికి ఏముందని ప్రశ్నించారు. 15వ తేదీ ఉదయం 9 గంటలకు పాత గాజువాక జంక్షన్‌లో తలపెట్టే మహాధర్నాకు ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

క్రికెట్ లీగ్ విజేత 'గుడ్‌షెపర్డ్'



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న జాన్‌వెస్లీ

విశాఖ స్పోర్ట్స్: యునైటెడ్ ఇన్‌ట్రెస్ట్ క్రిస్టియన్ క్రికెట్ లీగ్ విజేతగా గుడ్‌షెపర్డ్ లూథరన్ చర్చి నిలిచింది. వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్‌లో గురువారంతో ముగిసిన టోర్నీ ఫైనల్‌లో గుడ్‌షెపర్డ్ లూథరన్ చర్చి నిర్ణీత 10 ఓవర్లలో మూడు వికెట్లకు 101 పరుగులు చేసింది. ప్రతిగా ట్రూలైట్స్ చర్చ్ మూడు వికెట్లు కోల్పోయి 72 పరుగులకే పరిమితమైంది. శ్రావణ్ 62 రన్స్ చేశాడు. మూడు రోజుల పాటు జరిగిన ఈ టోర్నీలో పలు క్రైస్తవ చర్చ్‌ల జట్లు పోటీ పడ్డాయి. ముగింపు కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ విభాగపు అధ్యక్షుడు జాన్‌వెస్లీ హాజరై విజేతలకు ట్రోఫీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములు సహజమనే క్రీడాస్ఫూర్తిని అలవరుచుకోవడమే ఆటల ప్రధాన లక్షణమన్నారు. బహుమతి ప్రదానోత్సవంలో జగన్నాథరావు, నేతన్ ఐజాక్, ఎం.ప్రసాద్, సునీల్ ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ భరత్‌కు మక్కా మసీదు కమిటీ మొర



ఎంపీ భరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న మక్కా మసీదు కమిటీ ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : విశాఖ పార్లమెంట్ సభ్యుడు భరత్ గురువారం జగదాంబ జంక్షన్ సమీపాన గల మక్కా మసీదును సందర్శించారు. ఈ మేరకు కమిటీ అధ్యక్షుడు ఎస్ఏ మునీర్ వినతిపత్రం అందజేశారు. అంగటిదిబ్బలో మక్కా మసీదుకు చెందిన 3.5 ఎకరాల స్థలం ఆక్రమణలో ఉందని, గత 10 ఏళ్లుగా అంగటిదిబ్బలో ఆక్రమణకు గురైన స్థలానికి సంబంధించి వేరే ప్రాంతంలో ఇవ్వమని అడిగామని, లేదా ఆక్రమణలో ఉన్న ఫైర్ సర్వీస్ స్టేషన్‌ను ఖాళీ చేయమని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వక్ఫ్‌బోర్డు యాక్ట్ 2024ను రద్దు చేయాలని ముస్లింలు, మేధావులు కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మక్కా మసీదు కమిటీ ప్రతినిధులు, టీడీపీ నాయకులు మహ్మద్ నజీర్, సీతంరాజు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలపై పోటీ



సందీప్‌కు అవార్డు అందజేస్తున్న జేసీఐ వైజాగ్ అచీవర్స్

డాబాగార్డెన్స్ : జేసీఐ వైజాగ్ అచీవర్స్ ఆధ్వర్యంలో జేసీఐ వారోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు గురువారం జేసీఐ వైజాగ్ అచీవర్స్ ప్రెసిడెంట్ బి. దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలపై పోటీలు నిర్వహించారు. పోటీలో ఇద్దరు ప్రతిభావంతులను సత్కరించారు. నగర పరిధిలో గల రోసరీ ఇంగ్లీషు మీడియం విద్యార్థి వి. సందీప్ ఉత్తమ విద్యార్థి అవార్డు సొంతం చేసుకున్నాడు. ఎస్‌వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువతలో విద్య ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమతూకం చేయడం, విద్యావేత్తలకు మించిన జ్ఞానాన్ని పొందడం అంశాపై పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఐ వీక్‌ఛైర్మన్ డాక్టర్ ఆర్ఎస్‌వీ సోమశేఖర్, ప్రాజెక్టు డైరెక్టర్ భాస్కర్, సభ్యులు నాగభూషణ్, డాక్టర్ పర్వీన్ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతికి సంతాపం

అల్లిపురం : రాజకీయాల్లో గౌరవప్రదమైన నాయకుడు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర సమితి సభ్యుడు సీహెచ్ రాఘవేంద్రరావు, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన అకాల మరణం పట్ల వారు సంతాపం తెలిపారు. రాజకీయాలకు అతీతంగా గుర్తింపు తెచ్చుకున్న నేత ఏచూరి అని పేర్కొన్నారు. ఆయన మరణం దేశ రాజకీయాలకు, ముఖ్యంగా వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని తెలిపారు. ఏచూరి కుటుంబ సభ్యులకు సీపీఐ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఏచూరి కుటుంబానికి సానుభూతి..

మహారాణిపేట: ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, సీపీఎం అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పట్ల అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు గూడూరు సీతామహాలక్ష్మి సంతాపం వ్యక్తం చేశారు. సీతారాం ఆశయం మేరకు వారి పార్థివ దేహాన్ని పరిశోధనల నిమిత్తం ఏఐఐఎంఎస్‌కు దానం చేయడం గొప్ప విషయమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

వరద బాధితులకు యూత్ బాయ్స్ సాయం



వివరాలు వెల్లడిస్తున్న జగదీష్

డాబాగార్డెన్స్ : విజయవాడ వరద బాధితులకు సాయమందించేందుకు 35వ వార్డు పండావీధి, ప్రసాద్‌గార్డెన్స్ యూత్ బాయ్స్ ముందుకొచ్చారు. ఈ మేరకు గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో వరద బాధితుల సహాయార్థం సేకరించిన మొత్తాన్ని మీడియాకు వివరించారు. నటుడు సోనూసూద్ వైజాగ్ అభిమానుల సంఘం అధ్యక్షుడు డోలా జగదీష్ మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ. 50 వేలు కలెక్టర్ ద్వారా పంపనున్నట్టు తెలిపారు.

మైనారిటీల సంక్షేమానికి కృషి

బీచ్‌రోడ్డు: ముస్లింలతోపాటు వెనుకబడిన కులాల సంక్షేమానికి కృషి చేస్తామని రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అస్లాం ఖాన్ తెలిపారు. చినవాల్తేరు తమిళ్ స్ట్రీట్‌లోని 21వ వార్డు సమితి కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వారి సమస్యల పరిష్కారానికి ముందుంటామన్నారు. కార్యక్రమంలో సంఘ సేవకుడు, సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ గౌస్, సీనియర్ న్యాయవాది సలీం, కళా సంస్థల ప్రతినిధి చెన్నా తిరుమలరావు పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ సన్నిధిలో అన్నదానం



అన్నప్రసాదం వడ్డిస్తున్న రాజేంద్రన్, అనిత దంపతులు తదితరులు



వినాయకునికి పూజలు చేస్తున్న బాపూ ఆనంద్

అల్లిపురం : కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన శ్రీ రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావుతో కలిసి ప్రముఖ వ్యాపారవేత్త ఆర్.జి.రాజేంద్రన్, అనిత దంపతులు పాల్గొని ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ ప్రతి గురువారం అన్నసమారాధన చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పీలా వెంకట అప్పలనాయుడు, ఆలయ ముఖ్య సలహాదారు బొడ్డేటి ప్రసాద్, కమిటీ ప్రతినిధులు వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్, బడే నాగరాజు, సత్యనారాయణ, పాకలపాటి అప్పారావు, మధు, వాసుపల్లి నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

29, 31 వార్డుల్లో..

డాబాగార్డెన్స్ : వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా 29వ వార్డు ఆంథోనీనగర్‌లో రాక్‌స్టార్ బాయ్స్, ఊటగెడ్డలో బీఎంటీఎల్ బాయ్స్ పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. జనసేన నాయకుడు మన్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా 31వ వార్డు కనకలదిబ్బలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పెంటకోట రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రుల ఉత్సవాల్లో ఆ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, దేవకీ నంద ఫౌండేషన్ చైర్మన్ దొడ్డి బాపూ ఆనంద్ పాల్గొని స్వామికి పూజలు జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో మోహన్, హేమంత్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ నర్సులకు ప్రాధాన్యం కల్పించాలి



కేజీహెచ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు నర్సులు

మహారాణిపేట : తమను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ నర్సులు కేజీహెచ్ క్లాక్ టవర్ వద్ద ఏడవ రోజు నిరసనను కొనసాగించారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి పని చేసిన కాంట్రాక్ట్ నర్సులను కోవిడ్ వారియర్లుగా గుర్తించి పోస్టింగ్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని పోరాట కమిటీ నాయకుడు కోటేశ్వరరావు అన్నారు. తమను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో కాంట్రాక్టు నర్సులు శాంతియుతంగా ఏడు రోజులుగా నిరసన కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్ర కుటుంబ, ఆరోగ్య, సంక్షేమ శాఖ ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 115ను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంట్రాక్ట్ నర్సులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్‌లపై అవగాహన



సోలార్ రూఫ్ టాప్‌లపై అవగాహన కల్పిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీకే నాయుడు

పెదగంట్యాడ: ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన అనేది భారతదేశంలోని గృహాలకు అతి తక్కువ విద్యుత్ బిల్లులను అందించడానికి ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ పథకం అని ఏపీ ఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జికూటివ్ ఇంజనీర్ బీకే నాయుడు తెలిపారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధి నెల్లిముక్కు రామాలయం వద్ద గురువారం గ్రామస్తులకు ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా లబ్ధిదారులు తమ గృహాల పైకప్పులపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకోవడానికి సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఇంటికి తక్కువ ఖర్చుతో సౌర విద్యుత్ వెలుగులు పొందే ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. దీని ద్వారా పవర్ కట్ సమస్య కూడా ఉండదన్నారు. సామాన్యులకు విద్యుత్ చార్జీల భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. తీసుకోదలచిన క్యూఆర్ కోడ్ ద్వారా కానీ ఏపీ ఈపీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా కానీ పీఎం సూర్య ఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జికూటివ్ ఇంజనీర్ కేవీ త్రినాథ్, ఏఈ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



ఏఈవో శ్రీనివాసరావుకి చెక్కు అందిస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం నగరంలోని శివాజీపాలేనికి చెందిన కోన వసంత లక్ష్మి అనే దాత రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో ఏఈవో పిల్లా శ్రీనివాసరావుకి అందించారు. దాతకు స్వామివారి దర్శనం కలిప్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ముడసర్లోవ పార్కులో డస్ట్‌బిన్లు శిథిలం



పార్కులో విరిగిన డస్ట్‌బిన్

ఆరిలోవ: జీవీఎంసీ నిర్వహిస్తున్న ముడసర్లోవ పార్కులో డస్ట్‌బిన్లు విరిగిపోయాయి. పార్కులకు వెళ్లిన సందర్శకులు వేస్టేజీని ఎక్కడపడితే అక్కడ వేయకుండా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిలో వేసిన చెత్తను సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రం చేస్తుంటారు. ఇందులో భాగంగా ముడసర్లోవ పార్కులో కూడా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేశారు. వాటిలో కొన్ని విరిగిపోగా.. మరికొన్నింటికి అడుగు భాగంలో పెద్ద రంధ్రాలు పడ్డాయి. దీంతో వీటిలో చెత్త వేసినా ఉపయోగం లేకుండా పోతోంది. విరిగిన డస్ట్‌బిన్లలో వేసిన చెత్త బయటకు చెదిరిపోతోంది. ఇవి పాడవడం వల్ల కొందరు చెత్తను బయట వేసేస్తున్నారు. దీంతో పార్కు అధ్వానంగా మారుతోంది. విరిగిన వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్త డస్ట్‌బిన్లు ఈ పార్కులో ఏర్పాటు చేయాలని సందర్శకులు కోరుతున్నారు.